# నాన్నా ఒక్క చాన్సియ్యవూ!

ముచ్చటగా మూడో ప్రయత్నంలోనైనా కొడుకు పుట్టాలి. అనుకున్నాడు కామేశ్వర రావు. మళ్ళీ ఆడపిల్లే పుట్టింది.

ఇంక పిల్లల్ని కనే ఓపిక లేదని పురిటి మంచం మీదే ఏడిచింది కామాక్షి ఇంకొక్క ప్రయత్నమన్నాడు కామేశ్వరరావు.

మళ్ళీ ఆడపిల్లే పుట్టింది!

మొదటి మూడు కాన్పులూ ఆడపిల్లలయితే నాలుగోసారి మగపిల్లాడు పుట్టకూడదు. అయిదో కాన్పులో అబ్బాయి పుడతాడు అంది కామేశ్వరరావు తల్లి.

మీరు చేస్తున్నది చిన్న లారీ ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలో గుమాస్తా పని. మీ జీతంలో ఇంతమందిని పోషించగలమా ఆలోచించండి అని ఎంతగానో నచ్చచెప్పింది కామాక్షి

వినలేదు. కామేశ్వరరావు. "ఇదే ఆఖరు ప్రయత్నం - ఈ సారి కొడుకే పుడతాడు. నాది లారీ కంపెనీ ఉద్యోగం కాబట్టే కొడుకు కోసం ఇంతగా తాపత్రయ పడుతున్నాను. నా ఉద్యోగానికి పెన్షన్ వంటివేమీ లేవు. కొడుకే మనని వృద్ధాప్యంలో ఆదుకోవాలి."

అయిదోసారి కామేశ్వరరావు ఆశలు ఫలించాయి. అబ్బాయి పుట్టాడు. కామేశ్వర రావు ఆనందానికి అవధుల్లేవు.

పుత్రుడు జన్మించినప్పుడే కాదు పెరిగి పెద్దవాడవుతున్నప్పుడూ పుత్రోత్సాహాన్నే కల్గించాడు. వివేక్ అన్న పేరుని సార్థకం చేసేవాడు. ప్రతి క్లాసులోనూ ఫస్టుగా పాసయ్యాడు. అన్ని బహుమతులూ అతనివే.

ఇంటర్మీడియెట్ కూడా బాగా చదివాడు. సెకండ్ ఇయర్‌లో ఉండగా తండ్రి నడిగాడు "నాన్నా ఎమ్‌సెట్ రాస్తాను."

కామేశ్వరరావుకి గుండె ఆగినంతపనయింది. నలుగురు ఆడపిల్లల్నీ స్తోమతు లేక టెన్త్ క్లాసుతో ఆపించేశాడు. వాళ్ళందరికీ పెళ్ళిళ్లు చెయ్యాలి.

ఈ టైంలో కొడుక్కి ఇంజనీరింగు చెప్పించగలడా? ఉన్న ఊళ్లో ఇంజనీరింగు కాలేజి లేదు. ఫీజులే కట్టగలడో, లేదో తెలియదు. హాస్టల్లో ఉంచి చదివించడమా!

"ఎమ్ సెట్ రాయాలంటే వేరే ఊళ్లో ఉండి కోచింగ్ తీసుకోవాలిట కదా! మా కంపెనీ ఓనరు గారబ్బాయి అలాగే చదివాడు. అయినా సీటు రాలేదు."

"నేను కోచింగు తీసుకోను. ఊరికేనే రాస్తాను."

"సీటు వచ్చినా ఇంజనీరింగు చదివించలేను."

"నేను ఇంజనీరింగు చదవను. ఊరికేనే నా స్టాండర్డు తెల్సుకుందుకు రాస్తాను నాన్నా! ఒక్క ఛాన్సియ్యి, నాకు మంచి రాంకు వచ్చిందని చెప్పకోడంలోనే ఆనందం."

"పరీక్ష రాస్తే రాయి. ఇంటర్మీడియట్‌కే ఎక్కువగా చదువు. మామూలు డిగ్రీ చదువుదువుగానీ."

"అలాగే నాన్నా!"

అందరు తల్లితండ్రులూ వాళ్లపిల్లలు ఎమ్‌సెట్ మంచి రాంకుతో పాసవాలని కోరుకుంటున్నారు. కృషి చేస్తున్నారు. కామేశ్వరరావు ఏ తండ్రీ కోరుకోని విధంగా దేవుడికి మొక్కుకుంటున్నాడు "స్వామీ! మా అబ్బాయికి ఎమ్‌సెట్‌లో రాంకు రాకుండా చూడు."

అయిదుగురు పిల్లలు - అందునా నలుగురాడపిల్లల తండ్రి - ఇంతేమిటి కోరుకుంటాడు?

భగవంతుడెందుకనో ఏ తండ్రి కోరికా తీర్చలేదు. అందరి పిల్లలకీ సీటుకి ఆశలేని రాంకులొచ్చాయి. వివేక్‌కి గవర్నమెంట్ కాలేజిలోనే సీటొచ్చే రాంకు వచ్చింది.

వివేక్ మనస్సు ఆనందంతో ఉరకలు వేసింది. కామేశ్వరరావు గుండె గొంతుకకు అడ్డం పడింది.

"నాన్నా! నాకు మంచి గ్రూపులోనే సీటు వస్తుంది."

"వివేక్, నేను చదివించలేనని ముందే చెప్పానుగా."

"నాన్నా! నాకు ఛాన్సియ్యి నాన్నా! ఎక్కడైనా అప్పచేసైనా చదువుకుంటాను నాన్నా! ఉద్యోగం రాగానే అప్ప తీర్చేస్తాను."

"మనకి అప్ప ఎవరిస్తారు?"

వివేక్‌ని బి.ఎస్.సి.లో చేర్పించాడు కామేశ్వరరావు. ఇంజనీరింగ్ సీటు రాని వాళ్లు ఇంకో ఏడాది ఫుల్‌టైం కోచింగ్ తీసుకుని చదువుతూంటే, ఇంజనీరింగ్ సీటు వచ్చిన తను మామూలు బి.ఎస్.సి.లో చేరాడు.

అతనికి హితాలు బుర్రకెక్కడం లేదు.

కామేశ్వరరావుకి ఏదీ బుర్ర కెక్కడం లేదు 'నాన్నా ఛాన్సియ్యవూ' అని కొడుకడిగాడు.

"స్వామీ ఛాన్సియ్యి" అని తను దేవుణ్ణి అడగ్గలడా? ఇరవై ఏళ్లుకాలం వెనక్కి తిరిగి తనకు ఛాన్సిస్తే ఇద్దరాడపిల్లలతో ఆపేసి, ఇద్దర్నీ బాగా చదివించేవాడు కదా.

ఇంకొక్క ఛాన్సు ఎవరికీ రాదు. ఒక తప్పటడుగు కూడా పనికిరాదు. తను కొడుకు జీవితాన్ని ఉద్ధరించకుండా. కొడుకు తనని ఉద్ధరించాలనుకోవడం తప్పకాదా? ఈ పాఠం అందరికీ ఎలాగోలా చెప్పగలిగితే చాలు!

(ఆంధ్రప్రభ వీక్లీ)